క్లుప్తంగా

పోలీసు అమరులకు ఘన నివాళి



నాదెండ్ల: యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో సోమవారం అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. తొలుత అమరుల చిత్రపటాల వద్ద ఎస్‌ఐ బాలకృష్ణ, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ, సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు త్యాగం చేసిన అమరలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని కోరారు.

చిలకలూరిపేట: పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని అర్బన్ సీఐ పి.రమేష్ తెలిపారు. పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నక్సలైట్ల దాడిలో మృతి చెందిన సీఐ ఆర్.ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ మోహనరావు, కానిస్టేబుల్ ఉమర్, హోమ్‌గార్డ్ వెంకటేశ్వర్లు చిత్రపటాలకు సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇళ్ల లబ్ధిదారులకు త్వరలో బిల్లులు మంజూరు

శావల్యాపురం: 2014–19 ఆర్థిక సంవత్సరంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు బిల్లులు పెండింగ్‌లో లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు హౌసింగ్ ఏఈ షేక్ రసూల్ సోమవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో 690 మంది లబ్ధిదారులకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. లబ్ధిదారులు బ్యాంకు ఖాతా, ఆధార్ జిరాక్స్ నకలను గ్రామ సచివాలయ ఇంజినీరు అసిస్టెంట్‌కు అందజేయాలని కోరారు. నెల రోజులలో బిల్లుల నగదును బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందని పేర్కొన్నారు.

ప్రజా దర్బార్‌కు 34 అర్జీలు

నాదెండ్ల: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ ప్రతి సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. 34 అర్జీలు అందాయి. కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, సర్పంచి నాగలక్ష్మి, తహసీల్దార్ ఏవీ రమణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ స్వరూపా రాణి, నాయకులు తోట రాజారమేష్, బండరుపల్లి సత్యనారాయణ, గట్టినేని రమేష్, సదా శివరావు, హరిబాబు పాల్గొన్నారు.

నాదెండ్లలో సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో సోమవారం పంచాయతీ రాజ్ మాసోత్సవాల్లో భాగంగా పల్లె పండుగ నిర్వహించారు. బీసీ కాలనీలో రూ.25 లక్షలు, ఎస్సీ కాలనీలో రూ.35 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్లు, సైడు కాల్వల నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ తలతోటి రాణి, తహసీల్దార్ ఏవీ రమణ, ఇన్‌చార్జి ఎంపీడీవో స్వరూపరాణి, డీటీ ధనలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ, మండల టీడీపీ అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, నాయకులు నెల్లూరి సదాశివరావు, నల్లమోతు హరిబాబు, గట్టినేని రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట

నాదెండ్ల: గణపవరంలో సుమారు రూ.30 లక్షలతో నిర్మించిన గంగమ్మ తల్లి పోతురాజు స్వాముల విగ్రహ ప్రతిష్టా మహోత్సవం సోమవరం ఘనంగా నిర్వహించారు. గ్రామం నుంచి అప్పాపురం వెళ్లే డొంక రోడ్డులో సువిశాల విస్తీర్ణంలో ఆలయంతో పాటూ రెండు విశ్రాంతి గదులు నిర్మించారు. ఉదయం నిత్య పూజ, ఆలయ ప్రతిష్ట, యంత్రస్థాపన నిర్వహించారు. భారీ అన్నదానం చేశారు.

నేటి నుంచి సామూహిక ఎలుకల నిర్మూలన

వినుకొండ(నూజెండ్ల): సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాన్ని మంగళవారం నుంచి చేపడుతున్నట్లు మండల వ్యవసాయ అధికారి షేక్ సుగుణ బేగం సోమవారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా బ్రోమోడయోలిన్ మందును వంద శాతం రాయితీపై సరఫరా చేసినట్లు చెప్పారు.

నేటి నుంచి ఆధార్ శిబిరం

నరసరావుపేట: పట్టణ ప్రజలు తమ ఆధార్‌కార్డుల అప్‌డేట్ కోసం ఈనెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు పలు సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22వ తేదీన 5, 14వ వార్డు సచివాలయాలు, 23వ తేదీ 5, 10వ వార్డు సచివాలయాలు, 24వ తేదీన 5, 13వ వార్డు సచివాలయాలు, 25వ తేదీన 5, ప్రకాష్‌నగర్ తిలక్‌స్కూలులో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట: విద్యుత్ స్తంభాల మార్పులో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో మంగళవారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ ఆర్ అశోక్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల సరఫరా ఉండదని చెప్పారు. టౌన్ -1తో పాటు టౌన్-2 పరిధిలోని సుభానినగర్, రాగన్నపాలెం, పురుషోత్తమపట్నం ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

సాక్షి స్పెల్ బీ పరీక్షకు అనూహ్య స్పందన

నరసరావుపేట ఈస్ట్: పాఠశాల స్థాయి విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెల్ బీ పరీక్షకు అనూహ్య స్పందన లభించింది. కేసానుపల్లి సమీపంలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో సోమవారం పరీక్ష నిర్వహించారు. విద్యార్థులకు ఇంగ్లిష్‌పై ఉన్న భయాన్ని పోగొట్టి వారిలో నైపుణ్యాలను పెంపొందించే విధంగా నిర్వహించిన ఈ పరీక్షకు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. విద్యార్థులు తమ సామార్థ్యలను పరీక్షించుకునేందుకు స్పెల్ బీ గీటురాయిలా మారుతున్నదని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులను నాలుగు కేటగిరీలుగా విభజించి నిర్వహించిన పరీక్షకు 79 మంది విద్యార్థులు హాజరయ్యారు. కేటగిరి–1 లో 9 మంది, కేటగిరి–2కు 28 మంది, కేటగిరి–3కు 29 మంది, కేటరిగి–4కు 13 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కేటగిరీల వారీగా పరీక్ష నిర్వహించారు. స్పెల్ బి పరీక్ష ద్వారా ఆంగ్ల పదాల ఉచ్ఛరణతో పాటు భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను పెంచుకునేందుకు అవకాశం ఏర్పడిందని విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



స్పెల్ బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పదాల ఉచ్ఛరణ సులభతరం



స్కూల్‌లో నేర్చుకుంటున్న పాఠాలతో పాటుగా ఇంగ్లిష్‌లో కొత్త పదాలు, ఉచ్ఛరణతో పాటు వాటి అర్థాలను తెలుసుకున్నా. నిత్యం పాఠ్య పుస్తకాలలో ఉండే ఆంగ్ల పదాలపై అవగాహన ఉంది. స్పెల్ బీ ద్వారా ప్రత్యేక పదాలు తెలుసుకోవటం ద్వారా ఇంగ్లిష్‌పై పట్టు పెరుగుతుంది.

– బి.కౌషిక్, 9వ తరగతి

ఆత్మవిశ్వాసం పెరిగింది



స్పెల్ బీ పరీక్షకు హాజరు కావటం ద్వారా నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఇటువంటి పరీక్ష రాయటం ఇదే మొదటిసారి. కొద్దిగా సంశయించినా పరీక్ష రాశాక నాలో భయం పోయింది. ఇటువంటి పరీక్షలకు హాజరై నాకు వచ్చే గ్రేడ్‌ను చూసుకోవాలని ఉంది.

– షేక్ జంషీద్, 6వ తరగతి

పోటీతత్వం పెరుగుతుంది



స్పెల్ బీ వంటి పరీక్షలకు హాజరు కావటం ద్వారా పోటీతత్వం పెరుతుంది. నాతో పాటుగా పరీక్ష రాసిన వారికంటే ఎక్కువ ప్రతిభ చూపాలనే కోరిక పెరిగింది. ఇటువంటి పరీక్షలు విద్యార్థులలో మంచి పోటీని పెంచుతుంది. కఠినమైన పదాలను తెలుసుకోవటం మాకు ఎంతో ఉపయోగకరం

– ఈ.శ్రేష్ఠసమర్థ్, 4వ తరగతి

భాషపై పట్టు సాధ్యం



స్పెల్ బీ పరీక్షకు హాజరు కావటం ద్వారా ఆంగ్ల భాషపై పట్టు పెరుగుతోంది. కొత్త కొత్త పదాలను తెలుసుకోవాలనే ఆసక్తి పెరిగింది. మరిన్ని పదాలపై అవగాహన పెంచుకోవటం వలన ఆంగ్ల భాష సులభతరం అవుతుంది.

– జి.సాత్విక్‌చైతన్య, 5వ తరగతి

సులువైన పద్ధతులు తెలిశాయి



స్పెల్ బీ పరీక్ష వలన ఆంగ్ల భాషలో సులువైన పద్ధతులు తెలిశాయి. ఎన్నో కొత్త పదాలు, వాటిని ఎలా పలకాలి అనేది నేర్చుకోవచ్చు. పరీక్ష రాయటం ద్వారా ఇంగ్లిష్ మెలకువలు తెలుస్తాయి.

–జి.సంస్థిత, 5వ తరగతి

విద్యార్థులకు మంచి అవకాశం



సాక్షి మీడియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పెల్ బీ పరీక్ష ద్వారా విద్యార్థులకు ఒక మంచి అవకాశం కల్పించినట్లయింది. ఇటువంటి పరీక్షలకు హాజరు కావటం ద్వారా విద్యార్థులలో భాషా నైపుణ్యాలు పెరగటంతో పాటు పోటీ పరీక్షలకు హాజరయ్యేందుకు అవసరమైన మెలకువలు తెలుస్తాయి. ఇంగ్లిష్ భాషకు ఉన్న ప్రాధాన్యాన్ని విద్యార్థులు తెలుకోవటాని ఇదొక మార్గం.

– అల్పన ఉనియాల్, ప్రిన్సిపాల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్

రాష్ట్ర స్థాయి పోటీలకు వాసవీ డిగ్రీ కళాశాల విద్యార్థి



నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు వాసవీ డిగ్రీ కళాశాల విద్యార్థి షేక్ నాగషరీఫ్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్, సోమవారం తెలిపారు. సత్తెనపల్లి మండలం నందిగామలో నిర్వహించిన జిల్లాస్థాయి సీనియర్ సెపక్ తక్రా పోటీలలో నాగషరీఫ్ ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని వివరించారు. ఈనెల 22, 23తేదీలలో శ్రీకాకుళంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు నాగషరీఫ్ ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. కళాశాల కార్యదర్శి పి.పవనజ్యోతి, డైరెక్టర్ వి.శ్యామ్‌కుమార్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ బి.నాగేశ్వర రావు అభినందించారు. ాలని సిబ్బందికి సూచించినట్లు చెప్పారు.

వ్యక్తిపై దాడి

నరసరావుపేటటౌన్: స్వల్ప వివాద నేపథ్యంలో వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటన సోమవారం పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. కంభంపాలేనికి చెందిన కొట్టా ఏసోబు మున్సిపల్ కార్యాలయంలో శానిటరీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన దినేష్, నరేష్, కిరణ్‌రాజు కలిసి ఏసోబుపై దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చరణ్ తెలిపారు

బాలికలు క్రీడాల్లో రాణించాలి

శావల్యాపురం: రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటిన్ పోటీలకు బాలికలు ఎంపిక కావటం అభినందనీయమని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోడ్డపాటి విజయలక్ష్మి అన్నారు. స్థానిక పాఠశాలలో ఎంపికైన బాలికల అభినందన సభ సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఈనెల 20న ఉమ్మడి గుంటూరు జిల్లా ఎన్‌జీవో హోమ్స్ క్రీడా మైదానంలో సీనియర్ బాలికలకు బాల్‌బ్యాడ్మింటిన్‌లో జిల్లా ఎంపిక పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ఆకుమళ్ల సమీరా, కె.కావ్య, ముట్లూరి లూథియా, వేముల దివ్య, బి. దేవమణి, ఓర్సు స్రవంతి ,ఆర్.రత్నకీర్తన, ముక్కపాటి లిఖిత, యు.బసవరాణిలు రాష్ట్ర స్థాయి జట్టులో స్థానం సాధించినట్లు చెప్పారు.



ఎంపికైనా బాలికలు జట్టుతో ఉపాధ్యాయిలు

నవంబరు 8 నుంచి 10 వరకు నంద్యాలలో నిర్వహించనున్న 9వ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎంపికైనా బాలికల జట్టు పాల్గొంటారన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనా బాలికల జట్టును పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, స్టాఫ్ సెక్రటరీ బెజవాడ నాగేశ్వరరావు, కుమ్మరి శ్రీనివాసరాజు, భువనేశ్వరి, సురేష్,శ్రీకాంత్, నిర్మల,కిరణ్మయి, అబ్దుల్లా అభిందించారు.

వివిధ క్రీడా పోటీల్లో గుడ్‌షపర్డ్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

వినుకొండ(నూజెండ్ల): ఖోఖో అండర్ –18 విభాగంలో జిల్లా జట్టుకు ముగ్గురు ఎంపిక అయినట్లు గుడ్ షపర్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.లక్ష్మీసునీత సోమవారం తెలిపారు. ఇటీవల గుంటూరు జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో గుంటూరు టీజేపీఎస్ కళాశాలలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో విష్ణువర్ధన్, నాగరాజు, మణికంఠ ప్రతిభ చూపినట్లు చెప్పారు. అదే విధంగా నరసరావుపేటలో నిర్వహించిన అండర్– 14 విభాగం సాఫ్ట్ బాల్ పోటీల ఎంపికలో మోహన్‌గోపి, రాకేష్, రామకోటేశ్వరరావు, షటిల్ బ్యాడ్మింటన్‌లో కమల్‌కుమార్ జిల్లా జట్టుకు అర్హత సాధించారని పేర్కొన్నారు. కారంపూడిలో నిర్వహిచిన ఖోఖో అండర్ –14లో



ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్

విభాగంలో ఆంజనేయనాయక్, నాగవేణి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని వివరించారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ డాక్టర్ ఇన్నారెడ్డి, మంజుల రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు అజీమ్, వెంకట్, కొండలు, తిరుపతమ్మ అభినందించారు.

సెంట్రల్‌జోన్ బ్యాడ్మింటన్ విజేత 'ఎన్ఈసీ'

నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూకే సెంట్రల్ జోన్ పురుషుల బ్యాడ్మింటన్ పోటీలలో నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజేతగా నిలిచినట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సునీల్ తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 19, 20 తేదీలలో నిర్వహించిన అంతర కళాశాలల బ్యాడ్మింటన్ పోటీలలో కళాశాల జట్టు ప్రతిభ కనభర్చి ప్రథమ స్థానంలో నిలిచింది. సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సెంట్రల్ జోన్ పోటీలలో విజేతగా నిలిచిన జట్టులోని క్రీడాకారులు ఎస్.ధనుష్, ఎ.నాగేంద్ర, పి.బాలసతీష్, ఆర్.ఆదిత్యాచరణ్‌లను అభినందించారు. కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు, వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌బాబు, వ్యాయామ అధ్యాపకుడు ఎల్.కృష్ణారెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు.




క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఆర్బీకేల ద్వారా ఎరువులు పంపిణీ చేయాలి

రొంపిచర్ల: రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎరువులు సక్రమంగా పంపిణీ చేయాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణరాజు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలలో రైతులకు యూరియా తప్ప ఇతర ఎరువులు, పురుగు మందులు పంపిణీ చేయడం లేదన్నారు. దీని వలన రైతులు బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేయాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. బహిరంగ మార్కెట్లో నకిలీ ఎరువులు, పురుగు మందులు విక్రయించటం వలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సకాలంలో ఎరువులు, పురుగు మందులు పంపిణీ చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ బి.నిర్మల కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రొడ్డా అంజిరెడ్డి, మండల నాయకులు పిడెం హుస్సేన్, మధు, మోహనరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రొంపిచర్ల: మండలంలోని బుచ్చి బాపన్నపాలెం గ్రామ సమీపంలో సోమవారం రాత్రి చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో అరేపల్లి గ్రామానికి చెందిన బత్తుల శివ(40)అక్కడక్కడ మృతి చెందాడు. శివ తన ద్విచక్ర వాహనంపై ఆరేపల్లి నుంచి రొంపిచర్ల వైపు వెళుతుండగా నరసరావుపేట నుంచి ఆరేపల్లి ముప్పాళ్లకు వస్తున్న ఓ ప్రైవేట్ కాలేజీ బస్సు ఢీకొట్టింది. సమాచారం తెలుసుకున్న నరసరావుపేట రూరల్ సీఐ రామకృష్ణ, రొంపిచర్ల ఎస్ఐ అశోక్ ఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు రొంపిచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నరసరావుపేట: పిడుగుపాటుతో మృతి చెందిన పమిడిమర్రు గ్రామవాసి గాలం సీతారామయ్య మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాస్పత్రిలో సోమవారం పరిశీలించారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని కోరారు.

నిరుపేదలకు అండగా నిలవాలి

చిలకలూరిపేట: నిరుపేదలకు అండగా నిలవాల్సిన ఆవశ్యకత ఉందని అసిస్ట్ స్వచ్ఛంద సంస్థ అసోసియేట్ డైరెక్టర్ కృష్ణ హరీష్ చెప్పారు. యడ్లపాడు మండలం తిమ్మాపురంలోని ఎస్సీ కాలనీలలో ఫీడ్ ఇండియా, మైటూ ఫండ్ సంస్థల సంయుక్త సహకారంతో వెయ్యి కుటుంబాలకు నిత్యావసరాలను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి ప్రభావతి, అసిస్ట్ సంస్థకో ఆర్డినేటర్లు డేవిడ్, వెంకయ్య పాల్గొన్నారు.

తాగునీటి కోసం పొలం బాట

- మోటార్లు పనిచేయవు
- గండిగనుమల ప్రజలకు కష్టాలు
- అధికారులు కన్నెత్తిచూడరు

బొల్లాపల్లి: పల్లె ప్రజలు తాగునీటికి నోచుకోవడం లేదు. అధికారుల చిత్తశుద్ధి లేకపోవడంతో మోటార్లు మొరాయిస్తున్నాయి. ఇటీవల వర్షాలకు భూగర్భజలాలు వృద్ధి చెందిన వారికి నీరు అందడం లేదు. గ్రామంలో నెలకొన్ని రాజకీయాలు కూడా గ్రామస్తులకు శాపంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో తాగునీరు ఉన్నా కొన్ని ప్రాంతాల్లో మోటార్లు పనిచేయకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఇది మండలంలోని గండిగనుమల గ్రామంలో వేధిస్తున్న తాగునీటి సమస్య.

తాగునీటి సరఫరా ఇలా..

గ్రామంలో దాదాపుగా మూడువేల మందికి పైగా జనాభా ఉంది. 700 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఆయా కుటుంబాలతో పాటు పశువులు, జీవాలకు నీటి అవసరం ఉంది. రక్షిత తాగునీరు అందించేందుకు గ్రామంలో మినీ ట్యాంక్, ఓవర్‌హెడ్ ట్యాంక్ ఉంది. విద్యుత్ సరఫరాలో అంతరాయం, నిర్వహణ లోపంతో మోటార్లు మొరాయిస్తున్నాయి. 10 నుంచి 15 వరకు సింగిల్‌ఫేస్ మోటార్లు పనిచేయడం లేదు. గతంలో వర్షాలు సకాలంలో కురవక భూగర్భజలాలు అడుగంటి నీటి కొరత తీవ్రంగా ఉండేది. కాని ఇటీవల తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు గ్రామపరిధిలో భూగర్భజలాల నీటి మట్టం పెరిగింది. అయినా ఎన్నో ఏళ్లుగా ఉన్న నీటి సమస్య పరిష్కారానికి నోచుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. నీటి సరఫరా సరిపోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.



సమీపంలోని పొలాల నుంచి నీరు తెచ్చుకుంటున్న గండిగనుమల గ్రామస్తులు

తాగునీటి కోసం పొలాలకు..

సమీపంలోని పొలాల్లోకి వెళ్లి నీరు మోసుకోవాల్సిన పరిస్థితి. ఉదయం పనులకు వెళ్లి సాయంత్రం పొలాలకు వెళ్లి నీరు మోసుకోలేక పోతున్నామని, పశువులకు సరిపడ నీరు అందించలేకపోతున్నామని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికార యంత్రాంగం స్పందించి సింగల్ ఫేజ్ మోటార్లు మరమ్మతులు చేపట్టి నీటి సమస్య లేకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వివరణ కోసం ప్రయతి ్నంచగా అందుబాటులో లేరు.

పట్టించుకోని పాలకులు..

మరమ్మతులకు నోచుకోకపోవడంతో గ్రామంలో నీటి సమస్య జఠిలమైంది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులు నీటి సమస్య గురించి పట్టించుకోవడం లేదు. భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయని సింగిల్ ఫేజ్ మోటార్లకు మరమ్మతులు చేయిస్తే గ్రామంలో నీటి సమస్య ఉండదని గ్రామానికి చెందిన కొందరు రైతులు చెబుతున్నారు.



మరమ్మతులకు గురైన సింగిల్‌ఫేజ్ మోటారు

సంసిద్ పాఠశాల విద్యార్థికి రెండు బంగారు పతకాలు



భవనాశి వంశీ వేదాన్ష్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి సంసిద్ పాఠశాల యూకేజీ విద్యార్థి భవనాశి వంశీ వేదాన్ష్ అండర్–7 కేటగిరి ఇన్‌లైన్ రింగ్స్ పోటీల్లో జిల్లా స్థాయిలో రెండు బంగారు పతకాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగ సురేష్ సోమవారం తెలిపారు. మాట్లాడుతూ నవంబరు 6న జరగనున్న రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్‌తో పాటు 62వ జాతీయ స్థాయి పోటీల్లో మంచి ప్రదర్శన కనపరిచి పాఠశాలకు అకాడమీకి మంచి పేరు తేవాలన్నారు. ఎంపికైనా విద్యార్థి వంశీ వేదాన్ష్‌ను చాణిక్య స్పోర్ట్స్ అకాడమీ ఫౌండర్ చైర్మన్ నాగార్జున, కోచ్ శర్మ, మేనేజరు ప్రసన్నకుమార్ పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

సాక్షి మ్యాథ్స్ బీ పరీక్షకు విశేషస్పందన

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని గీతమ్ హైస్కూల్లో సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథ్స్ బి పరీక్షలకు విశేషస్పందన లభించింది. ఈ పరీక్షకు 6,7,8 తరగతులకు చెందిన 40 మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రత్యేకంగా సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించే స్పెల్ బీ, మ్యాథ్స్ బీ, ఇతర పోటీ పరీక్షలకు తమ పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనపరుస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.కృష్ణవేణి తెలిపారు.



సాక్షి మ్యాథ్స్ బీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ధన్యజీవి చుండి సుబ్బారావు

నాదెండ్ల: గణపవరం చుండి రంగనాయకులు విద్యా సంస్థల్లో సోమవారం కళాశాల వ్యవస్థాపక కార్యదర్శి చుండి సుబ్బారావు తొమ్మిదో వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యాధికుడైన చుండి సుబ్బారావు అప్పట్లో ప్రభుత్వ ఉద్యోగాన్ని కాదనుకుని తన తండ్రి స్థాపించిన కళాశాలను గొప్ప విద్యాకేంద్రంగా తీర్చిదిద్ది వేల మంది విద్యార్థులకు విద్యను అందించిన ధన్యజీవి అని అన్నారు. 1968లో ఇంటర్, డిగ్రీతో కళాశాల ప్రారంభమైందని, 1982లో పాలిటెక్నిక్, 1997లో ఇంజినీరింగ్, 2005 పోస్టుగాడ్యుయేట్ కోర్సులు ప్రారంభించారన్నారు. నాటి నుంచి నేటి వరకూ వేలాది మంది చదువుకుని జీవితంలో ఉన్నతంగా స్థిరపడ్డారన్నారు. తన తండ్రి చుండి రంగనాయకులు ఆశయాలను ఉన్నతంగా నిలిపేందుకు సుబ్బారావు తన జీవితాంతం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చుండి వేణుగోపాల్, కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు చుండి విజయసారథి, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ చైతన్య, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కళాశాల యాజమాన్యం

పిల్లలను పనిలో చేర్చుకుంటే చర్యలు

నరసరావుపేట: పట్టణంలో సోమవారం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా లేబర్ అధికారులు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు, ఎడ్యుకేషనల్ అండ్ ఎకనామిక్ డెవలప్మెంట్ సొసైటీ సభ్యులు, వివిధ షాపింగ్ మాల్స్, హోటళ్లు, రెస్టారెంట్లపై దాడులు చేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ లేబర్ అధికారి విష్ణు మాట్లాడుతూ.. పిల్లలను బడి మాన్పించడం, బలవంతంగా పనులు చేయించటం నేరమన్నారు. పనికి చేర్చుకునే సంస్థల యజమానులతో పాటు తల్లిదండ్రులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా బాల కార్మికుల ప్రొడక్షన్ అధికారి శౌరిరాజు, సీడ్స్ డైరెక్టర్ ప్రేమానందం, కోఆర్డినేటర్ శ్యాంపాల్, సోషల్ కమ్యూనిటీ వర్కర్ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

చిలకలూరిపేటటౌన్: ఈనెల 23వ తేదీన డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఆర్టీసీకి సంబంధించిన సమస్యల్ని ఫోన్ ద్వారా తెలియజేయాలని కోరారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్యలో ప్రయాణికులు నేరుగా డిపో మేనేజర్ దృష్టికి తేవాలని కోరారు.